షార్ట్ సర్క్యూట్‌తో ఎరువుల దుకాణం దగ్ధం

రూ.3కోట్లకు పైగా నష్టం



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఎరువుల దుకాణం

బత్తలపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఎరువుల దుకాణం దగ్ధమైంది. రూ.3 కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కదిరి రోడ్డులో మోహన్‌రెడ్డి ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి గస్తీ తిరుగుతున్న ఏఎస్‌ఐ సోమశేఖర్, లింగమయ్య, నాగార్జున ఎరువుల దుకాణాలో నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించి, యజమానికి ఫోన్ చేసి, పిలిపించి, షట్టర్లు తెరిపించారు. ఫైరింజన్‌ను పిలిపించారు. షాపు పైభాగంలో యునియన్ బ్యాంకు ఉండడంతో మంటలు అందులోకి వ్యాపించకుండా మాజీ ఎంపీపీ జక్కంపూటి సత్యనారాయణ కుమారుడు వెంకటేశ్వర చౌదరి ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించారు. ఎక్స్‌కవేటర్‌తో షాపు వెనుక వైపు గోడను తొలగించి, నీరు చల్లడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సోమశేఖర్.. కేసు నమోదు చేసుకున్నారు.

జై.. జగన్నాథ్..

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర



హిందూపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జగన్నాథుడి నామస్మరణతో పట్టణం మార్మోగింది. పూరీలో జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో కూడా నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో సాయంత్రం ముద్దిరెడ్డిపల్లిలో ప్రారంభమైన జగన్నాథుని రథయాత్రలో వందలాది మంది పాల్గొన్నారు. ముద్దిరెడ్డిపల్లి నుంచి తెలుగుతల్లి విగ్రహం, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా రైల్వేరోడ్డు, వాసవీ ధర్మశాలకు చేరుకుంది. ప్రత్యేక భజనలు నిర్వహించారు. తులసిపూజ, జగన్నాథ లీల, ప్రవచనాలు చేశారు. జగన్నాథుడు, బలరాముడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి, ఊరేగించారు.



జగన్నాథుడి రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

● విద్యాశాఖ కమిషనర్ విజయ్‌రామరాజు



అధికారులతో చర్చిస్తున్న విద్యాశాఖ కమిషనర్ విజయ్‌రామరాజు

కొత్తచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పక్కాగా చేయాలని విద్యాశాఖ కమిషనర్ విజయ్‌రామరాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జూలై 5న కొత్తచెరువుకు రానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి సభావేదిక స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. విద్యాశాఖ కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలు, కళాశాలలోని తరగతి గదులు, క్రీడామైదానాన్ని పరిశీలించారు. తల్లికి వందనం పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, విద్యాశాఖ ఏడీ సుబ్బారావు, ఎస్ఎస్ఏ పీఓ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్, జూన్27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో మూడు నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్యసాయి శతజయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు పుట్టపర్తికి వస్తారనీ, రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సు సర్వీసులు నడపాలన్నారు. పూల నాగరాజు మాట్లాడుతూ.. అవసరం మేరకు నూతన బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం మధుసూదన్, డిపో మేనేజర్ సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ పార్వతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏ గ్యాంగ్ పని?

దోపిడీ జరిగిన ఇల్లు



దోపిడీపై దర్యాప్తు ముమ్మరం.. గాలింపునకు ఎనిమిది బృందాలు

హిందూపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): భారీ దోపిడీలు జరిగితే ఘటనా స్థలాన్ని పరిశీలించి, నేరస్థులు నేరానికి పాల్పడిన వైనం, వారు ప్రవర్తించిన తీరును బట్టి ఇది ఏ గ్యాంగ్ చేసిందో పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చేవారు. హిందూపురం మండలం కిరికెర పంచాయతీ పరిధి వెంకటాద్రి లేఅవుట్‌లోని నిత్యానందరెడ్డి ఇంట్లో గురువారం రాత్రి జరిగిన దోపిడీపై రోజు గడిచినా పోలీసులు ఒక అంచనాకు రాలేకపోతున్నారు. శుక్రవారం రాత్రి వరకు చిన్నపాటి సాక్ష్యం కూడా దొరక్కపోవడంతో పోలీసులు తలలు బాదుకుంటున్నారు.

దర్యాప్తు ముమ్మరం

నిత్యానందరెడ్డి ఇంట్లో దోపిడీపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం అర్ధరాత్రి నుంచే డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో ఎనిమిది బృందాలను మూడు రాష్ట్రాలకు పంపారు. ఒక్కో టీమ్‌కు ఒక ఎస్ఐ ఉండగా.. రెండు టీమ్‌లకు సీఐని పర్యవేక్షణకు పెట్టారు. వీరు శుక్రవారం తెల్లవారుజాము నుంచే వేరే ప్రాంతానికి వెళ్లి ఈ రకంగా ఎక్కడ చోరీ చేశారో వారిని గుర్తించే పనిలో ఉన్నారు.

ఎక్కడా జరగలేదంట?

సాధారణంగా ఇంట్లోవారిని బంధించి చిత్రహింసలు పెట్టి ఇంట్లోని నగలు, నగదు దోచుకెళ్లేవారు. కిరికెర దోపిడీ మాత్రం అందుకు భిన్నంగా చేశారు. రాత్రి 9 గంటలు కాకనే కారులో వెళ్లి ఇంటి ముందే పార్క్ చేశారు. ఇంటిలోకి వెళ్లిన దుండగులు సుమారు 35 నిమిషాల పాటు అక్కడే ఉన్నారు. ఇంట్లోని నిత్యానందరెడ్డిని చేతులు కట్టేసి పూజగదిలో బంధించారు. అతడి భార్య ఓమలతను మరోగదిలో వేశారు. ఇద్దరు చిన్నపిల్లలు, నిత్యానందరెడ్డి తల్లిదండ్రులు నర్సారెడ్డి, లక్ష్మీదేవమ్మను హాల్‌లోని సోఫాలో కూర్చోబెట్టి వారి వద్ద ఉన్న నగలు లాక్కున్నారు. ఆ తరువాత బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకున్నారు. వెండి ఆభరణాలను ముట్టలేదు. అక్కడున్న కొంత నగదు మాత్రం ఎత్తుకెళ్లారు. చోరీకి వచ్చినవారు దర్జాగా ఇంట్లోని తినుబండారాలు తిన్నారు. వచ్చిన వారిలో ఓ దుండగుడు ఫోన్ కూడా మాట్లాడినట్లు తెలిపారు. అక్కడున్న వృద్ధురాలు లక్ష్మీదేవమ్మకు దప్పిక వేస్తే వాటర్ బాటిల్ తీసుకెళ్లి తాపించారు. వెళ్లేటపుడు తాళిబొట్టును తిరిగి ఇచ్చారు. ఈ తరహాలో దోపిడీ ఎక్కడా జరగలేదంటూ పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

తలలు బాదుకుంటున్న పోలీసులు

దోపిడీపై ఏ మాత్రం చిన్న క్లూ దొరికేనా అంటూ పోలీసులు ఆరాతీస్తున్నారు. డీఎస్పీ మహేష్, అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు నేరం జరిగిన వెంటనే శుక్రవారం రాత్రి వరకు కిరికెర సమీపంలోనే ఉంటూ నేరస్తులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. వారు వచ్చిన కారు ఎర్ర రంగులో ఉందని ఫోర్డ్ కంపెనీదిగా భావిస్తున్నారు. దోపిడీ అనంతరం దుండగులు కారులో పట్టణంలోని రహమత్‌పురం మీదుగా వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అందులో కూడా స్పష్టత లేకపోవడంతో దుండగులు మాట్లాడిన భాష, వచ్చినపుడు ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. నిత్యానందరెడ్డి వ్యాపారం చేసేవాడు. ఆ దిశగా ఎవరైనా ఆయనను కొంతకాలంగా గుర్తించి ఇలా చేశారా.. అన్న కోణంలో ఆరాతీస్తున్నారు. తాము ఎవరినో హత మార్చడానికి వచ్చి ఇక్కడికి వచ్చామని బాధితులతో దొంగలు అన్నమాటలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. పోలీసులను తప్పుదారి పట్టించేందుకే ఇలా మాట్లాడి ఉంటారని ఆ వర్గాలు భావిస్తున్నాయి. ఎవరైనా హతమార్చాలని సుపారీ తీసుకుని వస్తే పక్కాగా అక్కడికే వెళ్లేవారు. ఆ ఇంటికి వెళ్లి దోపిడీ చేయాల్సిన అవసరం అలాంటి వారికి ఉండదని పోలీసు వర్గాలు కొట్టి పారేస్తున్నాయి. ఇది దోపిడీకి వచ్చిన వారి పనేనని స్పష్టం చేస్తున్నాయి. దీనిపై డీఎస్పీ మహేష్‌ను అడగ్గా.. దొంగలను గాలించేందుకు ప్రత్యేక బృందాలను పంపామన్నారు. ఒకట్రెండు రోజుల్లో కేసును చేదిస్తామని తెలిపారు.

శాకాంబరిగా యల్లమ్మ దేవి



హిందూపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన యల్లమ్మదేవి శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాయగూరలతో అలంకరించిన అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

నిత్యనేరాలు..!

పురం ప్రాంతంలో కలవరం

రోజుకో ఘటనతో ప్రజల్లో ఆందోళన

పోలీసులకు సవాల్



స్థానికులను విచారిస్తున్న డీఎస్పీ



కిరికెరలో ఇంట్లోని వస్తువులను చిందరవందర చేసిన దొంగలు

హిందూపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు నిలయమైన పురం ప్రాంతంలో నేరాలు నిత్యకృత్యమవుతున్నాయి. తరచూ హత్యలు, అత్యాచారాలు జరుగుతుండడంతో ప్రజలు కలవరం చెందుతున్నారు. ఎప్పుడు, ఎలాంటి నేరం జరుగుతుందోనని భయంభయంగా ఉంటున్నారు. ఇవి పోలీసులను కలవరపెడుతున్నాయి. కొంతకాలంగా రోజుకో నేరం వెలుగులోకి వస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నేరాలు విపరీతంగా జరిగాయి. అప్పట్లో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. పోలీసులు, అధికార పార్టీ నాయకుల అండతో నేరగాళ్లు రెచ్చిపోయారు. ఇప్పటికీ కొన్ని పోలీసు స్టేషన్లలో వైసీపీ సానుభూతిపరులే ఉండటంతో నేరాలను నియంత్రించలేకపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పోలీసులకు సవాల్

వరుస నేరాలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. ఒక నేరాన్ని గుర్తించేలోపే.. మరొకటి వెలుగులోకి వస్తోంది. దీంతో (మిగతా 7లో..)

నీకింత.. నాకింత..!

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)





ఉపాధి పథకంలో టీడీపీ నాయకుల వసూళ్లు

● కొన్ని చోట్ల ప్రతి వారం ముడుపులు ఇవ్వాల్సిందే

● కూలీల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లకు.. వారితో నాయకులకు..

● పనులకు వెళ్లకపోయినా హాజరైనట్లు మస్టర్లు

● తెలుగు తమ్ముళ్ల దందాపై సీఎంఓకి ఫిర్యాదు

బుక్కరాయసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూలీలకేమోగాని టీడీపీ నాయకులకు మాత్రం ఉపాధి పథకం కల్పతరువుగా మారింది. మీరు ఏం చేసుకుంటారో మాకు తెలియదు మా వాటా మాకివ్వాల్సిందే అంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు టార్గెట్ ఫిక్స్ చేసి అవినీతికి పాల్పడుతున్నారు. అవినీతిని నివారించాల్సిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు కొందరు కూడా అక్రమ బాట పట్టారు. ప్రతి నెలా ప్రతి పంచాయతీ నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే అవినీతి హెచ్చుమీరిందన్న విమర్శలు వినవస్తున్నాయి.

ప్రతి వారం ముట్టజెప్పాల్సిందే..!

మండలంలో పది గ్రామ పంచాయతీల నుంచి ప్రతి వారం కొంత మంది టీడీపీ చోటా నాయకులకు ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు వేల రూపాయలు ముట్టజెప్పాల్సిందే. మండలంలో తూర్పు వైపు ఉన్న ఒక పంచాయతీలో వారానికే రూ.1.5 లక్షలు, అదే రూట్‌లో ఉన్న మరో పంచాయతీలో రూ.80వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఓ మాజీ ప్రజా ప్రతినిధి తన పంచాయతీలో (మిగతా 7వ పేజీలో...)

నిరుద్యోగ మహిళలతో ఆటలు..!

● అసమగ్రంగా ఆశా కార్యకర్తల నోటిఫికేషన్

● దరఖాస్తు ఎక్కడివ్వాలో తెలియని వైనం

● సచివాలయం, ఆరోగ్య కేంద్రాల చుట్టూ మహిళల ప్రదక్షిణ

● డీఎంహెచ్ఓ కార్యాలయానికి పరుగులు

● ఇక్కడికొచ్చినా నిరాశే..



దరఖాస్తులపై డీఎంహెచ్‌ను అడుగుతున్న అభ్యర్థులు

అనంతపురం వైద్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు.. నిరుద్యోగ మహిళలతో ఆటలాడుతున్నారు. ఆశా కార్యకర్త పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అంటూ వారిని ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారు. నోటిఫికేషన్‌లో 58 ఖాళీలు అని చెప్పి.. స్థానాలు మాత్రం 57 చూపుతున్నారు. దరఖాస్తు ఎక్కడివ్వాలన్న దానిపై కూడా స్పష్టత లేదు. గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. మహిళలు దరఖాస్తులతో అక్కడికెళ్తే వారు తీసుకోవట్లేదు. అలాంటపుడు నోటిఫికేషన్‌లో పేర్కొనడం దేనికని మహిళలు మండిపడుతున్నారు. చేసేదిలేక జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్ఓ) కార్యాలయానికి (మిగతా 7లో...)

ఏమ్మా.. భోజనం ఎలా ఉంది?

ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించిన ఆర్‌జేడీ

కొత్తచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కడప ఆర్‌జేడీ శామ్యూల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సన్నబియ్యంతో వంట ఎలా ఉంటోందని మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. గతంలో లావు బియ్యంతో వండే అన్నం ముద్దముద్దగా ఉండేదని, పిల్లలు కూడా సరిగా తినేవారు కాదని వారు సమాధానం ఇచ్చారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

ప్రస్తుతం సన్నబియ్యంతో వండిన అన్నాన్ని పిల్లలు ఇష్టంగా తింటున్నట్లు వెల్లడించారు.


పీఎస్ టీచర్ బడికి రాలేదంటూ ఫిర్యాదు

స్థానిక బాలికల హైస్కూల్‌కు ఫిజికల్ సైన్సు టీచర్ మహేశ్వరి రావడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారు. టీచర్ రాకపోతే తమ పిల్లలకు సైన్సుపాఠాలు చెప్పేది ఎవరని ప్రశ్నించారు. ఈమె ఏడాది నుంచి బడికి రాలేదని, దీంతో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో చాలామంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఆర్‌జేడీ వారికి హామీ ఇచ్చారు.

జిల్లా అభివృద్ధికి కృషి

అనర్హుల పింఛన్లు తొలగించాలి

సమీక్షా సమావేశంలో దిశ కమిటీ చెర్మన్ బీకే పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పుట్టపర్తి టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేద్దామని జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్, ఎంపీ బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో కలెక్టర్, దిశ సెక్రటరీ చేతన్ ఆధ్వర్యంలో పార్థసారథి అధ్యక్షతన శుక్రవారం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా 67లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారన్నారు. సాంకేతికంగా ఏర్పడిన లోపాలను సరి చేసి అర్హులైన వారందరికి ఈ పథకం అందేలా చర్యలు తీసుకోవాల న్నారు. పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన రైతులకు కేంద్రం, రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.14వేలు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక పింఛన్లపై విచారణ జరిపి అనర్హులను తొలగించాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్యను ఆదేశించారు.

మూడు నెలలకోసారి సమావేశం

సమావేశంలో కలెక్టర్ మాట్లాడూతూ ప్రతి మూడు నెలలకు ఒక సారి దిశ కమిటీ సమావేశం అవుతుందన్నారు. కేంద్రం నిధుల ద్వారా అమలవుతున్న పథకాల్లో లోపాలుంటే వాటిని పరిష్కరించుకుని ప్రజలకు మెరుగైన సేవలందించడం కోసమే ఈకమిటీ ఏర్పాటైందన్నారు. ఈసమావేశంలో ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు తీసుకుని కేంద్రానికి నివేదికలు అందిస్తామన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ పట్నంలో మత్స్యశాఖకు చెందిన చెరువులో ఏడేళ్లుగా సొసైటీ సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులు వెంటనే ఆయా పాఠశాలల్లో బాధ్యతలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యాధికారులను కోరారు. జిల్లాలో ఆధార్‌కేంద్రాలను యథాతథంగా కొనసాగించాలన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా రాయితీపై విత్తనాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటనారాయణ, పౌరసరఫరా శాఖ జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డి, పలు శాఖల అధికారులు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలతో ఆటలు..!

(5వ పేజీ తరువాయి)

వస్తున్నారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి. దరఖాస్తు తీసుకునే వారు లేరు, ఎక్కడివ్వాలో చెప్పేవారు కూడా లేరు. జిల్లా వైద్యాధికారి ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు దరఖాస్తులను ఆ శాఖ జిల్లా కార్యాలయంలోనే తీసుకోకుంటే ఎలాగని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తే తీసుకోనపుడు నోటిఫికేషన్ ఎందుకిచ్చారని నిలదీస్తున్నారు. దరఖాస్తు గడువు కూడా వారం రోజులే ఇచ్చి, అందులోనూ ఒక రోజు సెలవుగా ప్రకటించారు. ఖాళీల వివరాలను హెల్త్ సెంటర్లలో, సచివాలయాల్లోనూ ప్రదర్శించడం లేదంటున్నారు. నోటిఫికేషన్‌ను ఆన్‌లైన్‌లో జారీచేసి చేతులు దులుపుకుంటున్నారని అధికారులపై మండిపడుతున్నారు. సమగ్ర వివరాల్లేక డీఎంహెచ్ఓ కార్యాలయానికి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పుల తడకగా నోటిఫికేషన్..

నోటిఫికేషన్ విడుదల చేసేటపుడు సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రకటన ఉద్దేశం, పొందుపరచాల్సిన అంశాలు, స్వీకరణ గడువు, ప్రాంతాలు, ఖాళీలు ఇలా ప్రతిదీ వివరంగా ఉండాలి. ఆశా కార్యకర్తల నోటిఫికేషన్‌లో వివరాలే లేవు. ఒక ఫైల్ పూర్తిస్థాయిలో ఆమోదం పొందాలంటే.. డ్రాఫ్టర్, జూనియర్ అసిస్టెంట్ నుంచి ఉన్నతాధికారి వరకు సంతకాలు చేసి ఆమోద ముద్ర వేయాలి. ఆశా కార్యకర్తల నోటిఫికేషన్‌ను జిల్లా వైద్యాధికారి వరకు దాదాపు పది మంది అధికారులు పరిశీలించి, ఆమోదం తెలిపి ఉంటారు. అయినా తప్పుల తడకగా ప్రకటనను విడుదల చేయడం శోచనీయం. మొత్తం 58 ఖాళీ స్థానాలు చూపిస్తూ.. 36వ వరుస సంఖ్యలోని ఖాళీ వివరాలను ఎగ్గొట్టడం ఇందుకు నిదర్శనం. ఇతర సమాచారంలోనూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని మండిపడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుని, కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సరైన సమాచారం లేదు...



నోటిఫికేషన్‌లో సమగ్ర సమాచారం లేదు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పేరుతో జారీచేసిన ప్రకటనలో తప్పులుంటే ఎలా? దరఖాస్తుల స్వీకరణకు కనీసం రెండు వారాలైనా గడువు ఇవ్వాలి. ఏడురోజులు ఇచ్చి, అందులో ఒక రోజు సెలవుదినమని పేర్కొన్నారు. దరఖాస్తులతో ఎక్కడికెళ్లాలి, ఎవరికి ఇవ్వాలని చెప్పలేదు. దీంతో జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి రావాల్సి వస్తోంది.

-విజయలక్ష్మి, దరఖాస్తుదారు, అనంతపురం

ఎవరికి ఇవ్వాలి..?



ఆశా కార్యకర్త పోస్టుకు అప్లికేషన్ ఎవరికి ఇవ్వాలో తెలియడం లేదు. మా ప్రాంతంలోని హెల్త్ సెంటర్, సచివాలయానికి వెళ్తే తమకు సంబంధం లేదంటున్నారు. దీంతో డీఎంహెచ్ఓ ఆఫీస్‌కు వచ్చా. ఇక్కడా అప్లికేషన్ తీసుకోవడానికి ఎవరూలేరు. సమాచారం కూడా చెప్పడంలేదు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి. నోటిఫికేషన్‌లో చెప్పిన విధంగాను, డీఎంహెచ్ఓ ఆఫీస్‌లోనూ దరఖాస్తులు తీసుకోవాలి.

-పావని, దరఖాస్తుదారు, అనంతపురం

ఆశా కార్యకర్తల ఖాళీల వివరాలివీ..

హెల్త్ సెంటర్	ప్రాంతం
కూడేరు	కూడేరు-1 బ్రాహ్మణపల్లి
బొమ్మనహాళ్	దేవగిరి
నార్పల	నడింపల్లి నాయనపల్లి వెంకటాంపల్లి
రాకెట్ల గార్లదిన్నె యర్రగుంట్ల ఆత్మకూరు	ఆమిద్యాల ఎం.కొత్తూరు కోటంక మారెమ్మగుడి రంగంపేట
యల్లనూరు	యల్లనూరు వార్డు-2
యర్రగుంట	కొత్తపల్లి అంబాపురం పూలచెర్ల పుల్లంపల్లి
తాడిపత్రి	యర్రగునపల్లి
తరిమెల	ఏకులనాగేపల్లి
గడేహోతూరు	ధర్మపురి
డి.హీరేహాళ్	పూలకుర్తి
పెద్దపప్పూరు	మచ్చుకోట సింగనగుంటపల్లి దేవునిఉప్పలపాడు
బేతేపల్లి	అనగానిదొడ్డి
బెళుగుప్ప	కోనాపురం
క్రిష్ణపాడు	భీమునిపల్లి
శెట్టూరు	శెట్టూరు తిప్పనపల్లి-1
శ్రీధరఘట్ట	గొనేహాళ్
ఎంఎస్ పల్లి	బట్టువానిపల్లి యర్రంపల్లి
పుట్లూరు	పుట్లూరు ఎ.కొండాపురం
గుమ్మఘట్ట	కోనాపురం
కుందిర్పి	మలయనూరు
కురుగుంట	ఎ.నారాయణపురం-1 ఎ.నారాయణపురం-5 ఉప్పర్లపల్లి ఏటీపీ రూరల్-2 కొడిమి మన్నీల కందుకూరు-2
నాగలాపురం	కడలూరు
ఆవులదట్ల	గ్రామదట్ల మల్లాపురం కాశీపురం
పి.కొకుంట్ల	వెలిగొండ మైలారంపల్లి
పాల్తూరు	హావళిగి-1
అనంతపురం	శ్రీనగర్ కాలనీ 2వ రోడ్డు 38.మిస్సమ్మ కాలనీ
గుంతకల్లు	32వ వార్డు ఆచారమ్మ కొట్టాల 13వ సచివాలయం
గుత్తి	సీపీఐ కాలనీ-3
రాయదుర్గం	1వ సచివాలయం

బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం

174 మంది అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు స్థానచలనం



కౌన్సెలింగ్‌కు హాజరైన వార్డు సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గందరగోళం నడుమ మున్సిపల్ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక జీసెస్‌నగర్‌లోని జయమణెమ్మ కల్యాణమండపంలో 12మున్సిపాలిటీల పరిధిలోని సచివాలయ అడ్మిని స్ట్రేటివ్ సెక్రటరీలకు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు పూర్తయినవారు 219మంది, స్పౌజ్ ఇతర విజ్ఞప్తుల మేరకు 93 మంది బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 11మున్సిపాలిటీలలో మున్సిపాలిటీ యూనిట్‌గా బదిలీ చేపట్టారు. అనంత నగరపాలక సంస్థలో మాత్రం వార్డు సచివాలయం యూనిట్‌గా బదిలీ చేపట్టడంతో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఇందుకు నిరాకరించారు. నగరపాలక సంస్థలో 38 ఖాళీలు ఉండగా, 23మాత్రమే పొందుపరిచి, మరో 15ని బ్లాక్ చేయడాన్ని జేఏసీ నాయకులు తప్పుబట్టారు. లోపలికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా 174మంది అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను బదిలీ చేశారు.

నేడు మూడు ప్రాంతాల్లో కౌన్సెలింగ్

మున్సిపాలిటీల పరిధిలోని వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న ఐదు కేటగిరీల ఉద్యోగులకు నగరంలోని మూడు ప్రాంతాల్లో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. జీసెస్ నగర్‌లోని జయమణెమ్మ కల్యాణ మండపంలో ఉదయం 9గంటలకు వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలకు, మధ్యాహ్నం వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. తపోవనం సర్కిల్‌లో ఉన్న పుష్ప ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9 గంటలకు వార్డు శానిటేషన్ సెక్రటరీలకు, మధ్యాహ్నం 2గంటలకు వార్డు అమెనిటీస్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అనంత నగరపాలక సంస్థ నూతన కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 9గంటలకు వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిత్యనేరాలు..!

(5వ పేజీ తరువాయి)

పోలీసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎప్పుడు, ఎక్కడ ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సిబ్బంది కొరతవేధిస్తోంది. దీంతో నేరాల నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. హిందూపురంలో మూడు స్టేషన్లు ఉండగా 40 మంది సిబ్బందికూడా లేకపోవడం శోచనీయం. ఇటీవల బదిలీల్లో కొంతమంది వేరే ప్రాంతాలకు వెళ్లారు. ఇక్కడికి వచ్చినవారు ఎవరూ చేరలేదు.

నియంత్రణకు ప్రత్యేక చర్యలు:



మహేష్, డీఎస్పీ, హిందూపురం

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది కొరత వాస్తవమే. ఉన్న వారితోనే నేరాల అదుపునకు ప్రత్యేక ప్రణాళిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

ఇటీవల జరిగిన కొన్ని నేరాలు..

- గతేడాది అక్టోబరు 12న చిలమత్తూరు మండలంలో జరిగిన గ్యాంగ్ రేప్ రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది.
- నాలుగు నెలల క్రితం తూమకుంటలో చిన్నారిపై అఘాయిత్యం ఈ ప్రాంత ప్రజలను కలవరపెట్టింది.
- మూడు నెలల క్రితం లేపాక్షి మండలంలో కొత్తరకం హనీట్రాప్ వెలుగులోకి వచ్చింది. గతంలో ఇలాంటి ఉదంతం ఈ ప్రాంతంలో ఎన్నడూ వెలుగుచూడలేదు.
- గతేడాది గోళ్లాపురం వద్ద గంజాయి మత్తులో వ్యక్తిని హత్య చేశారు.
- తాజాగా లేపాక్షి మండలంలో వివాహేతర సంబంధం అనుమానంతో వ్యక్తిని దారుణంగా హత్యచేశారు. తల, మొండెం వేరు చేశారు.
- తాజాగా హిందూపురం మండలం మిట్టమీదపల్లి సమీపంలో భార్యాభర్తలను బంధించి నగలు దోచుకెళ్లారు.

రూ.3కే ట్రాక్టర్ మట్టి: మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు ఎరువుగా వాడే చెరువు మట్టి తరలించుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.3 చెల్లిస్తే చాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అధికారులతో మంత్రి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెరువు మట్టి తరలించాలంటే స్థానిక వైసీపీ నాయకుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేద న్నారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రూ.59 కోట్లతో పెనుకొండ నియోజకవర్గంలో 26చెరువుల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది పాలనలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారిని మాయమాటలతో వెంకటరమణ పక్కకు తీసుకెళ్లి అత్యాచారానికి యత్నిస్తుండగా స్థానికులు గమనించి మందలించారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రధాన నిందితుడి అరెస్ట్

దళిత బాలికపై అత్యాచారం కేసులో నిందితులందరూ దొరికారు

రామగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గుర్రాలపల్లి గ్రామంలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు ప్రత్యూష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 5న ఈ కేసు వెలుగు చూసిన వెంటనే 17 మందిపై కేసు నమోదు చేశారు. ఆరుగురు నిందితులను 9న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. 10న మరో ఏడుగురు నిందితులను కూడా రిమాండ్‌కు పంపారు. 11న మరో ముగ్గురు పెద్దమనుషులను నిందితులుగా చేర్చి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రత్యూష్ పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. అయితే పోలీసులు ప్రత్యూష్‌పై ప్రత్యేక నిఘా ఉంచి అతడి స్నేహితుని ద్వారా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడు కర్ణాటకలోని ఓ టీకొట్టులో పని చేస్తు కంబదూరుకు వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీంతో ఈ కేసులో ఎఫ్ఐఆర్‌లో నమోదైన నిందితులందరినీ అరెస్టు చేసినట్లయింది. కాగా ఇదే కేసుల ఓ అరెస్టయిన ఓ బాలుడికి బెయిల్ మంజూరైనట్లు తెలిసింది.

ఆరుగురికి ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ క్రిష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పామిడి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉన్న అశ్వత్థనాయుడు, జిల్లా పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న లీలాబాయి, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న విజయ్‌కుమార్, పెద్దవడుగూరు పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఫణిశేఖర్‌రెడ్డి, పరిగి ఎంపీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయ్‌భాస్కర్‌లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ ఇచ్చి ఉమ్మడి జిల్లాకే కేటాయించారు. సోముల దొడ్డి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రవిచంద్రను ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లాకు కేటాయించారు. అయితే ఉమ్మడి జిల్లాలో మరో డిప్యూటీ ఎంపీడీఓ స్థానం ఖాళీగా ఉండటంతో ఇక్కడికే కేటాయించాలని కమిషనర్‌ను కోరనున్నట్లు తెలిసింది. అలాగే కర్నూలు జిల్లా నుంచి ఎంపీడీఓగా అజయ్‌ను సత్యసాయి జిల్లాకు కేటాయించారు.

నేడు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించను న్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో అనంత జిల్లా ఎస్ఈ జహీర్ అస్లాం, ఈఈ ప్రభాకర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ, సూపరింటెండెంట్ ఖాజా ఆధ్వర్యంలో బదిలీలు చేపట్టను న్నారు. ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సర్క్యులర్ జారీ చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు..

ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్లు) పంచాయతీ కార్యదర్శులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించ నున్నారు. జడ్పీలో ఉమ్మడి జిల్లా డీపీఓలు నాగరాజనాయుడు, సమత, డీఎల్‌పీఓలు విజయ్‌కుమార్, శివకుమారి, శివనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు గ్రేడ్-6 కార్యదర్శులు (డిజిటల్ అసిస్టెంట్లు), మధ్యాహ్నం గ్రేడ్-5 కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

సెలవులో రామగిరి సీఐ

వ్యక్తిగతమా...? రాజకీయ ఒత్తిళ్లా?

ధర్మవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రామగిరి సీఐ శ్రీధర్ సెలవులో వెళ్లారు. ఆయన శుక్రవారం నుంచి 20 రోజుల పాటు సెలవుపెట్టినట్లు సమాచారం. ఉన్నఫళంగా సీఐ సెలవులో వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలా...? లేక రాజకీయ ఒత్తిళ్లతో సెలవుపై వెళ్లరా అనే చర్చ జరుగుతోంది. రామగిరి మండలంలో వరుస పరిణామాల నేపథ్యంలో సీఐ తీవ్ర ఒత్తిడికి గురైనట్లు సమాచారం. ముఖ్యంగా పాపిరెడ్డిపల్లిలో వైసీపీ కార్యకర్త లింగమయ్య హత్య, జగన్ పర్యటనలో కుంటిమద్ది హెలీప్యాడ్ వద్ద చోటుచేసుకున్న సంఘటనలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. దీనికితోడు రామగిరి మండలంలో ఓ బాలికపై అత్యాచార సంఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల సూచనతో సెలవుపై వెళ్లరా అనే చర్చ జరుగుతోంది. ఈ కేసుల దర్యాప్తు వేగంగా, సక్రమంగా సాగలేదన్న కారణాలు కూడా ఉండవచ్చని అంటున్నారు. సీఐ శ్రీధర్ తిరిగి ఇక్కడ విధుల్లోకి చేరుతారా లేదా అన్న సందేహం తలెత్తుతోంది. సెలవు విషయంలో సీఐ వివరణ కోసం ప్రయత్నించగా, ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది.

నలుగురు పిల్లలతో తల్లి అదృశ్యం

ధర్మవరం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన విజయ్ కుమార్ భార్య శ్రావణి తన నలుగురు ఆడపిల్లలతో ఈ నెల 25న అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఆమె తండ్రి శివయ్య శుక్రవారం ధర్మవరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 25న తన పిల్లలను హాస్టల్‌లో చేర్పించేందుకు ఆటోలో ధర్మవరానికి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా ఇంటికి తిరిగిరాలేదు. దీంతో భర్త విజయ్‌కుమార్ ఆమె తండ్రికి విషయం తెలియజేశారు. రెండు రోజులుగా ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శ్రావణి పుట్టినిల్లు కడప జిల్లా యర్రగుంట్ల.

కన్నుల పండువగా ప్రథమ దర్శనం

గూగూడుకు తరలి వచ్చిన భక్తులు



ప్రథమ దర్శనానికి తరలి వచ్చిన భక్తులు



నార్పల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గత ఏడాది బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే దాచి పెట్టిన కుళ్లాయి స్వామి పీరును ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా బయటకు తీశారు. పీరును అత్తరు, పన్నీరు, గంధంతో శుద్ధి చేసి భక్తులకు దర్శనం చేయించారు. కుళ్లాయి స్వామి ప్రథమ దర్శనం కావడంతో నార్పల మండలంతో పాటు తాడిమర్రి, బత్తలపల్లి, శింగనమల, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహించాలనీ, ఆ మేరకు అనుకూల వాతావరణం కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు ఇచ్చి, పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2020-23, 2023-27 పాలసీలో 17 యూనిట్లకు రూ.1.14 కోట్ల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారన్నారు. అనంతరం వార్షిక ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసయాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సీటీఓ మురళీమోహన్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి, డీటీసీ వీర్రాజు పాల్గొన్నారు.

నేడు ఆఖరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్

అనంతపురంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను శనివారం 1,20,001 ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు వరకు నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి తెలిపారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000వరకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు 415 మంది విద్యార్థుల హాజరైనట్లు పేర్కొన్నారు. వారికి సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించినట్లు వెల్లడించారు.

కూటమి పాలనపై ఏడాదిలోపే వ్యతిరేకత

వైసీపీ సమన్వయకర్త సజ్జల



సజ్జల రామకృష్ణారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్ 27(ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోపే తీవ్ర ప్రజావ్యతిరేకత వచ్చిందని వైసీపీ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యార్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలను మోసం చేసి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో జగన్ నామస్మరణ చేయడం తప్ప.. అభివృద్ధి ఊసే మరిచారన్నారు. చంద్రబాబు మోసాలను గుర్తు చేసేందుకు రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందులో స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలన్నీ వస్తాయన్నారు. అనంతరం రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే రాయలసీమలో స్వీప్ చేస్తామన్నారు. టీడీపీ అనుకూల సర్వేల్లోనే రాయలసీమలో ఎమ్మెల్యేల అవినీతి పరాకాష్టకు చేరిందని ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సమన్వయకర్తలు అనంతవెంకట్రామిరెడ్డి, ఉషశ్రీచరణ్, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు నరేష్, మాజీ మంత్రి శైలజానాథ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి శంకర్‌నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, సమన్వయకర్తలు దీప, ఈరలక్కప్ప పాల్గొన్నారు.

నీకింత.. నాకింత..

(5వ పేజీ తరువాయి)



పసులూరు గ్రామంలో పనిచేయకుండా ఖాళీగా కూర్చున్న కూలీలు (ఫైల్)

ఫీల్డ్ అసిస్టెంట్‌కు 'జీతం మాత్రమే నీది, మిగిలిన అవినీతి సొమ్మంతా నాదే' అని బహిరంగంగా చెప్పి వసూలు చేస్తున్నారు. తాడిపత్రి వైపు ఉన్న ఓ పంచాయతీలో వైసీపీ నుంచి ఇటీవలే టీడీపీలోకి వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతి కూలీ నుంచి వారానికి రూ.300 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తున్నాడు. డబ్బులిస్తే సరి లేదంటే మీకు పని పెట్టేది లేదు అని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ పంచాయతీలో కూలీల ద్వారా వచ్చిన కొంత నగదును పక్కన పంచా యతీకి సంబంధించిన ఇద్దరు టీడీపీ నాయకులకు అందజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంటులు కొనసాగుతున్నారు. ఎవరికి వారే పోటీ పడి పనికి రాని వ్యక్తుల పేర్ల మీద మస్టర్లు వేసి అప్పనంగా దోచుకుంటున్నట్లు కూలీలు ఆరో పిస్తున్నారు.

నీకు సగం... మాకు సగం ....!

ప్రస్తుతం ఉపాధి పనికి పోకపోయినా ఫర్వాలేదు జాబ్ కార్డు ఉంటే చాలు నేరుగా మీ అకౌంట్‌లో ప్రభుత్వం నగదు జమ చేసేలా మేము చేస్తాం. మాకు సగం... మీకు సగం అంటూ ఒప్పందాలు కుదుర్చుకు ని భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఇలాంటి దందా మండలంలో భారీగా సాగుతోంది. మూడు గ్రామ పంచాయతీలలో కూలీలు 400 మంది మాత్రమే పనులకు వెళ్తుంటే 1500 మంది పనికి వెళ్తున్నట్లు మస్టర్ రికార్డు చేస్తున్నారంటే అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇందులో ప్రధానంగా టెక్నికల్ అసిస్టెంట్లు, వారిపై అధికారి అవినీతికి ప్రధాన సూత్రధారులని పలువురు వాపోతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఇదే దందా కొనసాగుతోంది. పసులూరు గ్రామ పంచాయతీలో రాత్రి పూట ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయించడం ఉదయం కూలీలు అక్కడికి వచ్చి వెళ్లిపోతే డబ్బులు ఇస్తున్నారని జోరుగా చర్చ జరుగుతోంది.

అవినీతిపై సీఎంఓకి ఫిర్యాదు

నియోజకవర్గంలో జరుగుతున్న ఉపాధి అవినీతిపె కొంత మంది టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గ్రామాల్లో కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమ వసూళ్లకు పాల్పడటం వలన పార్టీకి చెడ్డ పేరు వస్తోందన్న విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో కొన్ని గ్రామ పంచాయతీలలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించేందుకు పార్టీ నేతలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వీటితో పాటు ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయానికి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న టీడీపీ నేతలను, ఉపాధి సిబ్బందిని పిలిపించి మందలించినట్లు తెలిసింది. అవినీతి లేకుండా పారదర్శకంగా పనిచేసుకోవాలని సూచించినట్లు సమాచారం.

తండ్రిపై కుమారుడి దాడి

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో తండ్రిపై కుమారుడు దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం జరిగింది. కిష్టప్ప, శంకరప్ప తండ్రీకొడుకులు. శంకరప్ప తరచూ మద్యం సేవించేవాడు. ఇందుకోసం డబ్బుకావాలని తండ్రిని వేధించేవాడు. మద్యం కోసం డబ్బు ఇవ్వనని కిష్టప్ప చెప్పడంతో శుక్రవారం ఉదయం శంకరప్ప తండ్రిపై కొడవలితో దాడిచేశాడు. కిష్టప్ప కుప్పకూలడంతో మృతి చెందాడని శంకరప్ప అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు కిష్టప్పను 108సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. శంకరప్పను అదుపులోకి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

తాడిపత్రి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లి గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు నెల రోజుల కిందట చిన్నకుళ్లాయప్ప తనపై అత్యాచారానికి యత్నించినట్లు ఓ మహిళ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులతో పాటు గ్రామ పెద్దలు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈక్రమంలోనే కొద్ది రోజులు గ్రామం విడిచి దూరంగా ఉండాలని సూచించారు. దాంతో చిన్న కుళ్లాయప్ప సొంతూరు వదిలి వేరేఊరిలో ఉంటున్నాడు. దీంతో సమస్య సద్దుమణిగింది. శుక్రవారం బోడాయిపల్లికి వచ్చి తన పొలంలో పని చేసుకుంటున్నాడని ఆ మహిళ బంధువులకు చెప్పింది. దీంతో వారు పొలం వద్దకు వెళ్లి చిన్నకుళ్లాయప్పపై దాడి చేశారు. తన అన్న బాలయ్యతో కలిసి చిన్నకుళ్లాయప్ప ఎదురుదాడి చేశాడు. ఈక్రమంలో కుళ్లాయప్పతో పాటు మహిళ బంధువులు రంగనాథ, రాకేష్, రంగసుధాకర్ గాయపడ్డారు. వీరికి తాడిపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యశ్విత సురక్షితం.. నేడు కదిరికి..

కదిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేరళలో తల్లిదండ్రులు అమ్మేసిన పసిపాప యశ్వితా బాయి(3)ని కదిరి పోలీసులు రక్షించారు. కదిరి మండలం మరవ తండాకు చెందిన శ్రీవాణి, రవీంద్ర నాయక్ దంపతులు ఉపాధి కోసం కేరళకు వెళ్లి, అక్కడ తమ కూతురును వదిలేసి వచ్చారు. పాప ఎక్కడ అని యశ్విత గురించి తాత ఆరా తీయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు గురువారం రాత్రి పాప తల్లిదండ్రులను కేరళకు తీసుకెళ్లారు. కొట్టాయం జిల్లా తిరువళ్లూరులో రాజేష్ అనే వ్యక్తి వద్ద ఉన్న పాపను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కదిరికి శనివారానికి చేరుకునే అవకాశం ఉంది. కాగా, పాపను తాము అమ్మలేదని, కొన్నిరోజులు తమ వద్ద వదిలి వెళ్లాలని కోరడంతో విడిచిపెట్టి వచ్చామని చెబుతున్నారు. కానీ పాపను అమ్మినందుకే గొడవ జరిగిందని బంధువులు అంటున్నారు. తాత నిలదీయడంతో యశ్విత తిరిగి తల్లిదండ్రులు, తన ఇద్దరు అన్నల చెంతకు చేరుతోంది.

చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు (గ్రేరంగాలు) టన్ను గరిష్టంగా రూ.31,100 అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.15వేలు, సరాసరి రూ.20వేలకు విక్రయాలు జరిగాయన్నారు.

న్యూస్ బాక్స్

ఈవీఎం గోడౌన్లను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోడౌన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భా గంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేశామని అ న్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ సురేశ్‌బాబు, నాయకులు ఆదినారాయణ, ఫకృద్దీన్, ఓబులేసు, సాయికుమార్, కరీం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఆర్డీఓ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

బత్తలపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయానికి ప్రజలు సమస్యలపై వస్తుంటారని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, సర్వేయర్ జోసఫ్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన

గాండ్లపెంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు మలేరియాపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వర్ మారుతి మాట్లాడుతూ.. మలేరియా దోమను లార్వా దశలోనే నిర్మూలించాలని సూచించారు. మురుగునీరు నిలువలేకుండా చూసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది రామాంజులు, ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



తనకల్లు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గీతాలవారిపల్లికి చెందిన ప్రవీన్ కుమార్ ఈనెల 26వతేదీ నుంచి కనిపించలేదని తండ్రి వెంకటరమణ తనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. కొక్కంటి గ్రామానికి చెందిన ముక్కెసాబ్ అనే వ్యక్తి రూ.20వేలు అధిక వడ్డీకి ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చాడు. డబ్బు ఇవ్వలేదన్న నెపంతో ప్రవీణ్‌కుమార్ ద్విచక్రవాహనాన్ని ముక్కెసాబ్ తీసుకెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైనప్రవీణ్‌కుమార్ ఇంటికి తిరిగి రాకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9346917118కు సమాచారం ఇవ్వాలని కోరారు.

శివాలయానికి రూ.50 వేలు విరాళం

ధర్మవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన న్యాయవాది రామకృష్ణారెడ్డి, అనూరాధ దంపతులు స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణంలో నూతనంగా నిర్మించిన శివాలయానికి రూ.50వేలు విరాళం ఇచ్చారు. శుక్రవారం షిర్డీసాయిబాబా సేవాసమితి అధ్యక్షుడు వీరనారాయణ, ఉపాధ్యక్షుడు నా రాయణరెడ్డి, కార్యదర్శి లింగమయ్య, సభ్యులను కలిసి ఈ విరాళా న్ని అందజేశారు. అనంతరం సాయిబాబాకు పూజలు చేయించారు.

క్షుద్రపూజల కలకలం

నల్లచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక గీతామందిరం సమీపంలోని మైదానంలో చేసిన క్షుద్రపూజలు కలకలం రేపుతున్నాయి. గీతామందిరం సమీపంలోని మైదానంలో నిత్యం యువకులు ఆడుకుంటుంటారు. నిత్యం ప్రజలు తిరిగే రద్దీ ప్రాంతంలో ఇలాంటి క్షుద్రపూజలు చేయడంతో భయాందోళన చెందుతున్నారు. స్థానిక బస్టాండ్‌లోని మొబైల్ షాపు ముందుకూడా అక్షింతలు, ఎండుమిరపకాయలు, నిమ్మకాయలు వేసినట్లు షాపు నిర్వాహకుడు చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జనావాసాల మధ్య క్షుద్రపూజలు చేయడంతో ప్రజలు పోలీసు లకు సమాచారం అందించారు. ఈ విషయంపై ఎస్ఐ మగ్బుల్‌బాషాను వివరణ కోరగా.. గీతామందిరం సమీపంలో క్షుద్రపూజలు చేసినట్లు ప్రజలు తమ దృష్టికి తెచ్చారని, తాము సంఘటనాస్థలాన్ని పరిశీలించామని తెలిపారు. క్షుద్రపూజలు చేసినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయశాఖ ఏడీగా లక్ష్మానాయక్



ధర్మవరంరూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ధర్మవరం డివిజన్ ఏడీగా లక్ష్మానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏగా ఉన్న క్రిష్ణయ్య బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు. రాయదుర్గంలో ఏడీఏగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మానాయక్‌ను ధర్మవరానికి నియమించారు. దీంతో ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, ఏఓలు, ఏఈఓలు, ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

ముదిగుబ్బ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్డంపల్లితండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 40 మంది విద్యార్థులకు రూ.10వేల విలువ చేసే పలకలు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, అట్టలు తదితర విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. నల్లమాడ మండలంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అంజనేయులునాయక్ గతంలో గుడ్డంపల్లితండా పాఠశాలలో చదివారు. చిన్నతనంలో తాను చదివిన పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందించిన దాతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫకృద్దీన్ శాలువ కప్పి, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేస్తున్న దాత, ఉపాధ్యాయులు

పూర్తయిన భవనాలు.. కాంట్రాక్టర్ చేతిలో తాళాలు..!

● బిల్లులు రాలేదని అప్పగించని వైనం ● అద్దె గదుల్లో కార్యాలయాలు ● పట్టించుకోని అధికారులు



ఉబిచెర్ల గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఆరోగ్య కేంద్రం, సచివాలయం, రైతు సేవా కేంద్రం

నల్లచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల భవనాలు పూర్తయి రెండేళ్లవుతున్నా.. కాంట్రాక్టర్ తాళాలు అప్పగించకపోవడంతో ప్రైవేటు భవనాల్లో నిర్వహించాల్సి వస్తోంది. తనకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ భవనాలను అప్పగించలేదు. మండలంలోని ఉబిచెర్ల పంచాయతీలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ సెంటర్ పూర్తయి రెండేళ్లవుతున్నా తాళాలు వేసి ఉన్నాయి. రెండేళ్లయినా తనకు బిల్లులు రాలేదని సచివాలయం నూతన భవనానికి తాళాలు వేసి కాంట్రాక్టర్ వద్దే ఉంచుకున్నాడు. దీంతో గ్రామ సచివాలయం ఇరుకైన, సౌకర్యాలు లేని పాత పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కొత్త సచివాలయం అలంకార ప్రాయంగా మారింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి తాళాలు ఇప్పించుకుని, నూతన భవనంలోని మార్చాల్సిన అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ పాలనలో నిర్మించిన సచివాలయ భవనం గురించి కూటమి ప్రభుత్వం వచ్చి యేడాదవుతున్నా, అధికారులు పట్టించుకోలేదు. ఉబిచెర్ల గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను కొన్నిరోజులు నూతన భవనంలో నిర్వహించారు. ఆరునెలలు నిర్వహించిన తరువాత బిల్లులు సరిగా రాలేదని కాంట్రాక్టర్ ఖాళీ చేయించాడు. ప్రస్తుతం హెల్త్ సెంటర్‌ను హైస్కూల్‌లోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. హెల్త్ క్లినిక్ సెంటర్‌లో గ్రామానికి చెందిన ఓ మహిళ నివాసమున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ ఆమెకు తాళాలిచ్చి ఆమెను నివాసం ఉండాలని చెప్పినట్లు తెలుస్తోంది.

బిల్లులు పెండింగ్..

ఉబిచెర్ల గ్రామంలో వైసీపీ ప్రభుత్వం సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు సేవా కేంద్రానికి రూ.21 లక్షల 80వేలు, హెల్త్ సెంటర్‌కు రూ.15లక్షల నిధులు మంజూరు చేసింది. రైతు సేవాకేంద్రం, హెల్త్ సెంటర్ భవనాలు పూర్తి చేశారు. సచివాలయం చివరి బిల్లులు రూ.6 లక్షలు పెండింగ్ ఉండడంతో తాళాలు కాంట్రాక్టర్ వద్ద ఉంచుకున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఏఈ గురురాజు గుప్తను వివరణ కోరగా.. బిల్లులు రావాల్సినది వాస్తవమేనని తెలిపారు. గతంలో నిర్మించిన భవనాలకు రూ.6 లక్షల బిల్లులు రావాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్ తాళాలు ఇవ్వకపోవడాన్ని మండల అధికారులు చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపీడీఓ రఘునాథగుప్త మాట్లాడుతూ.. ఉబిచెర్ల గ్రామంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ సెంటర్ సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి, త్వరలో స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

చెరువు గట్లను పటిష్టం చేయాలి: ఎమ్మెల్యే



లబ్ధిదారులతో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని చెరువుల గట్లను పటిష్టం చేసి ప్రతిఎకరాకు నీరందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో అన్నాక్యాంటీన్ వెనుకభాగాన నూతనంగా జలవనరులశాఖ కార్యాలయాన్ని ఆమె మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజక వర్గంలో 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లను హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. అనంతరం 18, 19, 20 వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఈ గంగాధర్, ఏఈ జమునాబాయి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు రామాంజనేయులు, బెస్తచలపతి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అనారోగ్యానికి గురై ఆర్థికంగా చితికిపోయిన పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కొండంత అండగా ఉన్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 13 మంది పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 10,12,909 చెక్కులను మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి అందచేశారు. డబ్బును సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ట్యాబులు..

మెప్మా సంఘాల ఆర్పీలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి ట్యాబులను అందచేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 26 మంది ఆర్పీలకు ట్యాబులను అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ పీసీ గంగన్న, మెప్మా కోఆర్డినేటర్ రమాదేవి, ప్రశాంతిపట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలి'



రిలే దీక్షల్లో పాల్గొన్న ఇంజనీరింగ్ కార్మికులు

ధర్మవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కార్మికులకు జీఓ నెంబరు 36 ప్రకారం జీతాలు పెంచాలని ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, సహాయ కార్యదర్శి బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్‌కోడ్స్‌ను రద్దుచేయాలని, తల్లికి వందనం పథకంతో సహా అన్ని రకాల సంక్షేమ పథకాలను షరతులు లేకుండా అమలు చేయాలని, ఆప్కాస్, ప్రైవేటు ఏజెన్సీలను అనుమతించకూడదని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు కాటమయ్య, యోగేశ్, అనిల్ పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్ ప్రచారయాత్రకు విశేష స్పందన



ప్రచారయాత్రకు మద్దతు ఇస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారయాత్రకు ధర్మవరంలో పారా అథ్లెట్లకు భారీ స్పందన లభించింది. స్థానిక మార్కెట్‌యార్డు వద్ద నిర్వహించిన ప్రచారయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు హాజరై వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రచారయాత్ర కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారాక్రీడలు కూడా సాధారణ క్రీడలతో సమానమైనవని అన్నారు. వీటిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జింకా చంద్రశేఖర్, పోతుకుంట రాజు, జనసేననాయకులు అరిగెల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సదుపాయాలు కల్పించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు

అమడగూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య విధులు నిర్వహించాలంటే తగిన సదుపాయాలు కల్పించాలని ఎంపీడీఓ మునియప్పకు పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వినతి పత్రం అందించారు. పంచాయతీ కేంద్రంతోపాటు గ్రామాల్లో శుభ్రత, వ్యర్థాల తరలింపునకు తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామాలకు స్వచ్ఛ వాహనాలు, కార్మికులకు వేతనాలు సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉండడంతో ట్రైసైకిళ్ల ద్వారా చెత్తను తరలించడం కష్టం అన్నారు. ప్రతి పంచాయతీకి డీజిల్, ఎలక్ట్రికల్ ఆటోలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు భాస్కర్, చంద్ర, రామలింగారెడ్డి, శ్రీనివాసులు, సుమియా, జానకీ, మమత పాల్గొన్నారు.

అంగన్‌వాడీలలో సామూహిక అక్షరాభ్యాసం

బత్తలపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 1 నుంచి 4వ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్‌వైజర్ చంద్రమ్మ తెలిపారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని అన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతారామాలయ నిర్మాణానికి విరాళం

నల్లచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బసవన్న కట్ట సమీపంలో నిర్మిస్తున్న సీతారామాలయానికి పలువురు దాతలు శుక్రవారం విరాళాలు అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తహసీల్దార్ రవికుమార్ రూ.5,116, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రూ.3,166, నల్లచెరువు దొడ్లపాల డెయిరీ మేనేజర్ బైరెడ్డి రూ.5,116 విరాళాలు అందించినట్లు చెప్పారు.

ఇంటివద్దే రేషన్ పంపిణీ



వృద్ధుడికి రేషన్ ఇస్తున్న డీలర్

ఓబుళదేవరచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం డీలర్ ఆర్ఫీఖాన్ వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము ప్రతినెలా ఇంటి వద్దకే దివ్యాంగులు, వృద్ధులకు అందిస్తామని తెలిపారు. ప్రతినెల 1నుంచి 15 వరకు లబ్ధిదారులకు డిపోల వద్ద నిత్యావసర వస్తువులు అందిస్తున్నామన్నారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు తోఫీక్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

● నంబులపూలకుంట: చౌకధాన్యపు డిపో పరిధిలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దకే నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డిపో కేంద్రం ప్రతినెల 1నుంచి 15వతేదీవరకు నిత్యవసరవస్తువులు అందించాలన్నారు. 26నుంచి 30వతేదీ వరకు వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకు రేషన్ తీసుకెళ్లి ఇవ్వాలన్నారు.

భవిత సెంటర్‌ను పరిశీలించిన ఆర్డీఓ

కదిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీవో వీవీఎస్ శర్మ పరిశీలించారు. ఆయనతోపాటు ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి ఉన్నారు. ఆర్డీవో ఫిజియో థెరపీ గురించి డాక్టర్ రూపేష్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు బోధించే విధానం, సౌకర్యాలు పరిశీలించారు. వారితోపాటు భవిత కేంద్రం ఉపాధ్యాయులు అన్వేష్, సౌమ్యం, శ్రీదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

వేదవిద్యను రక్షించాలి



వేద మహాసభను ప్రారంభిస్తున్న ఆర్డీవో వీవీఎస్ శర్మ, పాల్గొన్న విద్యార్థులు, అర్చకులు

కదిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో కీలకమైన వేద విద్యను పరిరక్షించాలని, అది భారతీయుల కర్తవ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం దత్త ఫంక్షన్‌హాల్‌లో శ్రీఖాద్రీక్షేత్ర బ్రాహ్మణ సమాఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సరస్వతి వేదవిద్యా మహాసభలను ప్రారంభించారు. మొదటిరోజు వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నాలుగు వేదాలు, వాటి శాఖల గురించి వివరించారు. కాలక్రమేణ ఆ శాఖలు తగ్గిపోతున్నాయన్నారు. వాటిని రక్షించాల్సిన కర్తవ్యం భారతీయులపై ఉందన్నారు. మూడురోజులపాటు ఇది కొనసాగుతుందన్నారు. మొదటిరోజు గోపూజ, వేదపరీక్షలు వేద పారాయణం నిర్వహించి, సమాఖ్య మహిళా సంఘం సభ్యులు స్తోత్ర పారాయణం చేశారు. తిరుపతికి చెందిన డాక్టర్ కుప్పావిశ్వనాథ్ శర్మ ధార్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా హనుమంతువఝల, మారుతిశర్మతోపాటు ఆర్డీవో వీవీఎస్ శర్మ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీహరిప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

'మన ఇంటికి మన ఎమ్మెల్యే'లో కందికుంట



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైనవారికి అందకుంటే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం 'మన ఇంటికి.. మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా 20 వార్డులో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికెళ్లి ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ పథకాలు కూడా రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలను సంవత్సరంలోనే అమలు చేస్తున్నామని చెప్పారు. ఓర్వలేని ప్రతిపక్షం ఏదో విధంగా బురద చల్లడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. వారికి లబ్ధిదారులే సమాధానం చెబుతున్నారని తెలిపారు. అందుకే వారు తలెత్తుకోలేకపోతున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెద్దమ్మ తల్లికి గోరింటాకుతో అలంకరణ



ధర్మవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మతల్లికి ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా గోరింటాకుతో అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేయించారు. బుగ్గవంశస్థుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏడు శుక్రవారాలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేస్తామని అర్చకుడు వెంకటేశ్‌శర్మ తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



కేక్‌ను కట్ చేస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు

కదిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో శుక్రవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు వేణుగోపాల్, హాస్టల్ విద్యార్థులచే కేక్‌ను కట్ చేసి, చిన్నారులకు పంచి పెట్టారు. అంతకుముందు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హరిప్రసాద్‌బహుజన్, వార్డెన్ ప్రసన్నకుమారి, దిల్‌షాద్, శ్రావణి, నసీమా, మస్తాన్, బాలరాజు, చిన్నా, వీరవినేష్ణ పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటా: పల్లె



సాంబశివ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పల్లె

ఓబుళదేవరచెరువు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి అండగా ఉంటానంటూ కార్యకర్తలకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ప్రమాదాల్లో గాయపడిన కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని గౌరాపురంలో మృతిచెందిన పెద్దవెంకటరాముడు కుటుంబాన్ని పరామర్శించి, మృతుడి భార్య అక్కులమ్మ, కుమారులను పలకరించి అండగా ఉంటామని ఆర్థికసాయం అందించారు. అదే గ్రామంలో టీడీపీ కార్యకర్త సంజీవప్ప కోడలు మునియమ్మకు శస్త్రచికిత్సలు చేయడంతో ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు జయన్న సోదరుడు సాంబశివ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుమారుడు నాగరాజు, తల్లి సరస్వతిని పరామర్శించారు. ఆయనతోపాటు మాజీ జడ్పీటీసీ సభ్యుడు పిట్టా ఓబులరెడ్డి, కన్వీనర్ జయచంద్ర, నాయకులు మహబూబ్‌బాషా, రమణ రెడ్డి, సుధాకర్, నిజాం, ఆర్ఫీఖాన్, సుధాకర్, ఆంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

పుట్టపర్తి రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సచివాలయ సిబ్బందికి వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలని వైసీపీ యువజన రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలోని విలేకరులతో మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది బదిలీలను కూటమి ప్రభుత్వ పెద్దల నిర్ణయాలతో నిర్వహించడం భావ్యం కాదన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో బాలికలకు సీట్ల కేటాయింపులు రాజకీయ కోణంలో జరుగుతున్నాయని, ఎంపీ ఎమ్మెల్యే మంత్రులు కూటమి నాయకుల సిఫార్సులకు పెద్దపీట వేస్తున్నారని ఆయన ఆరోపించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కొత్తచెరువు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పవన్ కల్యాణ్, నవీన్, సాయిత్రినేష్‌గౌడ్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఇంటర్ జోనల్ స్టేట్ ఫుట్‌బాల్ టోర్నమెంటుకు ఎంపికైనట్లు కేటీసీ ఫుట్‌బాల్ కమిటీ సభ్యులు శీన, గంగాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థులు ఈ నెల 29,30 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే టోర్నమెంటులో పాల్గొంటారని వివరించారు.

మహిళా సాధికారతతోనే గ్రామీణాభివృద్ధి

పుట్టపర్తి రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సర్పంచుల మూడురోజుల శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లుగా త్రివేణి, సానియా, మజీద్, వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, శిక్షణ కోర్సు డైరక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళా సర్పంచులు పంచాయతీల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు

గాండ్లపెంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డికి పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము అందరం శనివారం సామూహికంగా సెలవుపై వెళుతున్నామని పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు తెలపడానికి వెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు బాషా, భవానీ, రెడ్డెమ్మ, మదన్‌మోహన్, శ్యామ్‌కుమార్, ఓబులమ్మ, వసుంధర పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి.. బాధితులకు వరం

- మంత్రి సవిత



చెక్కులు అందుకున్న వారితో మంత్రి సవిత

పెనుకొండటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ఒక వరమని మంత్రి సవిత అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 34మందికి రూ.59,92,000చెక్కును మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏడాది పాలనలో 155మందికి రూ.1,29,35,000 నగదును చెక్కుల రూపంలో అందించామన్నారు. ఈ సందర్భంగా పెనుకొండ, గోరంట్ల, పరిగి, రొద్దం, సోమందేపల్లి ఐదు మండలాలకు చెందిన బాధిత కుటుంబాలు చెక్కులు అందుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, త్రివేంద్ర, అరుణ్‌రెడ్డి, గుట్టూరు నాగరాజు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వేణుమాదవ యాదవ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహేష్ కోరారు. శుక్రవారం మంత్రి సవితను ఆమె స్వగృహంలో కలిసి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అమరప్ప, గోపాల్, రమేష్, శివశంకర్, శ్రీనివాసులు, నాగరాజు, మైలార్, రాము, రాజగోపాల్, మంజునాథ్, భాస్కర్, బద్రియాదవ్ పాల్గొన్నారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో నీట్ పరీక్షలో ర్యాంక్ సాధించిన సంతోష్ నాయక్‌కు శుక్రవారం ఆర్థికసాయం చేశారు. ఉన్నత చదువుల నిమిత్తం జూనియర్ కళాశాలలో పార్ట్‌టైం అధ్యాపకులుగా పనిచేస్తున్న ఉమాశంకర్ రూ.20వేలు మంత్రి కార్యాలయంలో సవిత చేతులమీదుగా విద్యార్థికి అందజేశారు.

కూలిపోయేలా.. భయపెడుతూ..!



పెనుకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ బజార్‌లో యాడికి నాగరాజు ఇంటి ముందు విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వీస్తున్న గాలుల కారణంగా ఎప్పుడే ఏ ప్రమాదం జరిగి.. ఏమి నష్టం వాటిల్లుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. విద్యుత్‌శాఖాధికారులు స్పందించి వెంటనే కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని 108

ఇబ్బందుల్లో మండలవాసులు



సోమందేపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో 108 వాహనం మరమ్మతు కారణంగా మూలనపడింది. మండలవ్యాప్తంగా నిత్యం వివిధ అనారోగ్య కారణాలతో వందల మంది ఆస్పత్రికి వస్తుంటారు. మండలం మీదుగా జాతీయ రహదారి వెళ్తుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలబారినపడి అనేక మంది ఆస్పత్రికి రావాల్సిన పరిస్థితిలో 108సేవలు నిలిచిపోవడంతో మండలవాసులు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల పందిపర్తి గ్రామానికి చెందిన మహిళ అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో 108సేవలు అందక ఆటోలో ప్రయాణిస్తూ మార్గమధ్యలో పురుడు పోసుకున్న సంఘటన జరిగింది. ఇలాంటివి కోకొల్లలు. ఈ నేపథ్యంలో 108 వాహనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కరెంటు కోతలు.. ఇబ్బందుల్లో రైతులు

చిలమత్తూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కోతలు లేని నాణ్యమైన విద్యుత్‌ని అటు వ్యవసాయానికి ఇటు గృహాలకు సరఫరా చేస్తున్నా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోతలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోడూరు ఫీడర్‌లో రెండు రోజులుగా విపరీతంగా విద్యుత్ కోతలు జరుగుతున్నాయి. దీంతో విత్తనాలు విత్తుకున్న రైతులు తడి ఇవ్వడానికి నానా తంటాలు పడుతున్నారు. ఒక పక్క వరుణ దేవుడు మొహం చాటేస్తుండటంతో మరో పక్క ఇలా విద్యుత్ కోతలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురగాలుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో తరుచూ విద్యుత్‌లైన్లు చెట్ల కొమ్మలు తాకి ట్రాన్స్‌ఫార్మర్లలో ఫీజలు పోతున్నట్లు రైతులు అంటున్నారు. అయితే చెట్ల కొమ్మలను తొలగించి అంతరాయం లేని విద్యుత్‌ని సరఫరా చేయాల్సి ఉండగా అధికారులు ఆ విషయంపై దృష్టి సారించడంలేదని వాపోతున్నారు. దీంతో విద్యుత్ అంతరాయం పెద్ద సమస్యగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ని అందివ్వాలని కోరుతున్నారు.

ఆస్పత్రిలో డీసీహెచ్‌ఎస్ విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోరంట్ల, జూన్27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న పరిణామాలపై పుట్టపర్తి డీసీహెచ్‌ఎస్ మధుసూధన్ శుక్రవారం విచారణ జరిపారు. 'డీడీఓ బాధ్యతలకు జంకుతున్న డాక్టర్లు' అన్న కథనానికి స్పందించిన ఆయన ఆసుపత్రిని సందర్శించారు. ఆత్మహత్యాయత్నం ఘటనకు బాధ్యులైన శానిటేషన్ వర్కర్ లక్ష్మీ, హెడ్‌నర్సు మల్లమాంబను, మెడికల్ అధికారి ఉషాను విచారించారు. అనంతరం ఆసుపత్రిలోని అన్ని విభాల వారితో సమావేశమై చిన్న విషయాలు పెద్దవిగా చేయకుండా ఒక కుటుంబంలా కలిసి పనిచేసుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే అధికారులు, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆయనతోపాటు మెడికల్ అధికారి అష్పట్, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ తేజశ్వనీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ముస్లిం యూత్ కమిటీ ఎన్నిక

సోమందేపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జామియా మసీదులో శుక్రవారం ప్రార్థన అనంతరం నూతన యూత్ కమిటీని ఎంపిక చేశారు. పట్టణంలోని ఐదు మసీదులకు సంబంధించి ఓ కమిటీగా ఏర్పడ్డారు. గౌరవాధ్యక్షులుగా అంజాద్‌అలీ, అధ్యక్షులుగా జబీవుల్లా, ఉపాధ్యక్షులుగా షోడాల బాబు, కార్యదర్శిగా అమీర్, మన్సూర్, కోశాధికారిగా ఆజాద్, మీడియా ప్రతినిధిగా బాబా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముస్లింలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా కమిటీ కృషిచేస్తుందన్నారు.

నగరాభివృద్ధి ప్రాధికారుడు కెంపేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర అభివృద్ధి ప్రాధికారుడు కెంపేగౌడ అని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌ఎస్‌కే సముదాయ భవనంలో నిర్వహించిన కెంపేగౌడ జయంతిని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కెంపేగౌడ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే

శిథిలావస్థలో ప్రభుత్వ శాఖల క్వార్టర్స్

ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

అద్దె ఇళ్లలోనే పోలీసులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు



మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్‌శాఖ ఉద్యోగుల క్వార్టర్స్

చిలమత్తూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ ఉద్యోగం చేస్తే అక్కడే నివాసం ఉండాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్టీఆర్ ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో సౌకర్యవంతమైన ఇళ్లను నిర్మించి ఇచ్చారు. అయితే వాటి ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో ఆ ఇళ్లు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు ప్రభుత్వం అప్పట్లో ప్రత్యేక క్వార్టర్స్‌ని అన్ని సౌకర్యాలతో నిర్మించింది. పోలీసులకు ఈద్గా మైదానం పక్కనే సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి పక్కా భవనాలను ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు ఆ భవనాల్లోనే స్టేషన్లలో విధులు నిర్వహించే పోలీసులు ఉండేవారు. అయితే రానురాను ఆ ప్రాంతంలో వసతులు తగ్గిపోవడం, చర్యలు తీసుకునేవారు లేకపోవడంతో ఆ ఇళ్లల్లో ఉండేందుకు వారు సుముఖత చూపలేదు. ప్రత్యామ్నాయంగా అద్దె ఇళ్లల్లో ఉంటూ వస్తున్నారు. అదేవిధంగా విద్యుత్‌శాఖకు సంబంధించి ఉద్యోగులు స్థానికంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో అన్ని సౌకర్యాలతో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. విశాలమైన ఇళ్లతో పాటు రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించారు. అయితే భవనాలపై పర్యవేక్షణ లేకపోవడంతో రానురాను అవి పాడుబడ్డాయి. ఆ భవనాల పరిస్థితి చూసి ఉద్యోగులు వాటిలో చేరేందుకు సముఖత చూపడంలేదు. అద్దె ఇళ్లల్లో ఉంటూ వస్తున్నారు. సుమారుగా ఈ రెండు శాఖల ఉద్యోగుల క్వార్టర్స్ నిరుపయోగంగా మారి శిథిలావస్థలో ఉన్నాయి. పోలీస్, విద్యుత్‌శాఖల క్వార్టర్స్‌కు సంబంధించి ఇళ్లకు ఉన్న కిటికీలు, తలుపులు ఇతర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఇళ్లు బాగుంటే.. అద్దెలు మిగిలేవి..

పోలీసు, విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఏర్పాటుచేసిన క్వార్టర్స్‌లోని ఇళ్లల్లో వసతులు బాగుంటే ఉద్యోగులకు పెద్ద మొత్తంలో ఇంటి అద్దెలు మిగిలేవి. ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలకు అనుగుణంగా మండల స్థాయి ఉద్యోగులకు 12 శాతం అద్దె ఖర్చులు అందిస్తోంది. దీంతో రూ. 50 వేలు వేతనం తీసుకునే ఉద్యోగికి కూడా కేవలం 4 వేల వరకు మాత్రమే ఇంటి అద్దె ఖర్చులు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం మండల కేంద్రంలో ఎంత చిన్న అద్దె ఇళ్లు కావాలన్నా రూ. 8 నుంచి రూ. 10 వేలు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ క్వార్టర్స్ ఉపయోగంలో లేకపోవడంతో అదనంగా రూ.4వేల నుంచి రూ.6వేల వరకు ఆ శాఖల ఉద్యోగులు వెచ్చించాల్సి వస్తోంది.

స్థలాల కబ్జాకు అవకాశం

క్వార్టర్స్ శిథిలమవ్వడంతో ఆ స్థలాలు కబ్జాకు గురయ్యే అవకాశం లేకపోలేదు. మండల కేంద్రంలోని నడిబొడ్డున స్థలాలను ఎంపిక చేసి ఇళ్లను నిర్మించారు. అయితే ఇప్పుడు ఈ క్వార్టర్స్ చుట్టుపక్కల సెంటు స్థలం ధర రూ. లక్షల్లో పలుకుతోంది. ఈ కారణంగా ఈ స్థలాలపై కబ్జాదారుల కన్నుపడే అవకాశం ఉంది. పోలీస్ క్వార్టర్స్‌కు సంబంధించి ఎటువంటి ప్రహరి, కంచెగానీ లేదు. దీంతో సులభంగా కబ్జా చేసే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఈ క్వార్టర్స్‌కు సంబంధించి స్థలాలను ప్రభుత్వ స్వాధీనం చేసుకొని ఉద్యోగులకు నూతన భవన సముదాయాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం..



విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులకు చాలా కాలం క్రితం కార్యాలయ ఆవరణంలోనే వసతి గృహాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అయితే అవి ఇప్పుడు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటిలో నివాసం ఉండటానికి వీలు లేకుండా పోయింది. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు ఈ నివాస వసతి గృహాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే మరమ్మతులుగాని, నూతన భవనాల విషయంపై ఎలాంటి స్పందనరాలేదు. దీంతో ఉద్యోగులు బయట అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. శిథిలావస్థలో ఉన్న వసతి గృహాల విషయాన్ని మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా.

- జయవర్ధనరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ

మరింత సబ్సిడీ వేరుశనగ ఇవ్వండి

బయట మార్కెట్‌లో కొనలేకపోతున్నాం

నిబంధనలు సడలించి పంపిణీ చేయండి

రైతుల వేడుకోలు



వేరుశనగ సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

మడకశిర, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నిబంధనలు సడలించి సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, వర్షాభావం, పంటలు దెబ్బతినడంతో ఖరీఫ్‌లో వేరుశనగ సాగు తగ్గుతూ వచ్చింది. అష్టకష్టాలు పడి రైతులు సాగుకు సిద్ధం చేసుకున్నా వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు వేరుశనగ పంట సాగు చేయలేక పోయారు. ఖరీఫ్ ప్రారంభమై ఇప్పటికే 15రోజులు కావస్తోంది. గత సంవత్సరం ఈ సమయానికి 25 శాతం పంటలను సాగు చేశారు. ఈఏడు ఖరీఫ్‌లో 5 శాతం కూడా పంటలు సాగుకు నోచుకోలేదు. బోరు, బావుల కింద మాత్రం రైతులు పత్తి, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేశారు. కొంత మంది రైతులు మూడు రోజులు కిందట కురుసిన కొద్ది పాటి వర్షానికి వేరుశనగ పంటను సాగు చేశారు. రెండు నుంచి మూడు, నాలుగు ఎకరాలు ఉన్న రైతులు విత్తనం సమకూర్చే పనిలో ఉన్నారు. బయట మార్కెట్‌లో ధర అధికంగా ఉందని సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేయాలని కోరుతున్నారు. మడకశిర మండలానికి 11305 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించారు. నియోజకర్గంలో 22వేల హెక్టార్లలో వేరుశనగను సాగు చేస్తారు. ప్రస్తుతం కేటాయించిన వేరుశనగ 6వేల హెక్టార్లలో సాగు చేసేందుకు ఉపయోగపడుతుంది. మిగతా 14 వేల హెక్టార్లలో వేరుశనగ పంట వేసేందుకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు. మడకశిర మండలానికి 3361 క్వింటాళ్లకుగాను 3347 క్వింటాళ్ల వేరుశనగను, అగళి మండలానికి 1553గాను 1517 క్వింటాళ్లు, అమరాపురం మండలానికి 2555గాను 2420కింటాళ్లు, గుడిబండకు 2192 క్వింటాళ్లకుగాను 2192 క్వింటాళ్ళ విత్తనం పంపిణీ చేశారు. రొళ్ల మండలానికి 1644 క్వింటాళ్లకుగాను 1621 ఇచ్చారు. నిబంధనలు సడలించి వేరుశనగ సాగుకు అవసరం ఉన్నంత మేర పంపిణీ చేయాలని రెతులు కోరుతున్నారు.

సబ్సిడీ వేరుశనగను బయట మార్కెట్‌లో సబ్సిడీపోను క్వింటాళ్ రూ.5580లు ఉండగా బయట మార్కెట్‌లో క్వింటాళ్ రూ.8వేల వరకు ధర పలుకుతోంది. అయితే విత్తనాలు కేజీ 110 నుంచి 120 ధర ఉంది. ఆర్థిక ఇబ్బందులు కారణంగా పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోయామని అధిక ధర పెట్టి విత్తనాలు కొన లేక పోతున్నామని రైతులు అంటున్నారు. రైతులకు సరిపడ వేరుశనగనుపంపిణీ చేయాలని కోరుతున్నారు.

బయట కొనలేకపోతున్నా



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ ఎకరాలో సాగు చేసేందుకు సరిపోతుంది. మిగతా ఎకరాలో సాగు చేయాలంటే బయట మార్కెట్ అధిక ధర పెట్టి కొనుగోలు చేయాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొనలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించి సబ్సిడీతో వేరుశనగను అందించాలి.

-రైతు, శికుమార్, వడ్రహట్టి, రొళ్ల

11305 క్వింటాళ్లు పంపిణీ చేశాం

40 శాతం సబ్సిడీపోను రూ.5580లతో క్వింటాళ్ల వేరుశనగను రైతులకు అందిస్తున్నాం. నియోజకవర్గంలో 11305 క్వింటాళ్ళ వేరుశనగను పంపిణీ చేయడం జరిగింది. వేరుశనగను జూన్ 15 నుంచి జూలై 15 వరకు సాగు చేసుకోవచ్చు.

-తిమ్మప్ప, వ్యవసాయశాఖ అధికారి

శివాపురంలో కార్డెన్‌సెర్చ్

మడకశిర టౌన్, జూన్27(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని శివాపురంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. నాటుసారా, అక్రమ మద్యం అమ్ముతున్నట్లు అనుమానం ఉన్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం శివాపురం కాలనీ వాసులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మట్కా, జూదం తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లరాదని, వెళితే చర్యలు తప్పవన్నారు.

నేడు అన్న క్యాంటీన్‌కు భూమిపూజ

పెనుకొండటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటిన్ నిర్వహణకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం భూమిపూజ చేయనున్నట్లు మండల కన్వీనర్ ప్రసాద్ శుక్రవారం విడుదలచేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నగరాలు, పట్టణాల్లో ఉన్న అన్న క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు.

200 మంది ఎంపిక: జేసీ



డ్రాలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్

గోరంట్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం వద్ద ఉన్న నాసిన్ అకాడమీలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 200 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ శుక్రవారం తెలిపారు. నాసిన్ అకాడమీలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రతి తరగతికి 40 మంది విద్యార్థుల వంతున లాటరీ పద్ధతిలో 200 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి జేసీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అడ్మిషన్ల కోసం 714మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఎంపికైన వారి జాబితాను నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మోక్షం



బీసీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు

మడకశిర రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాకతో గ్రామీణ రహదారులకు మహర్దశ వచ్చింది. గ్రామాల్లో గుంతలమయమైన రహదారులను గుర్తించి ఆ రహదారులలో సీసీ రోడ్డు వేయించారు. దీంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 16 పంచాయతీలు 110 గ్రామాలు ఉన్నాయి. రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. గత వైసీపీ పాలనలో రోడ్ల మరమ్మతులకు సంబంధించి ఎన్నిమార్లు అధికారులు, నాయకులకు వినతులు ఇచ్చినా స్పందించలేదని, ప్రస్తుత ప్రభుత్వం చొరవచూపి నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టిందని గ్రామీణులు అంటున్నారు. మరమ్మతులకు నోచుకోని రహదారులకు చేయించి ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా చేసిందని అన్నారు. గౌడనహళ్లి గ్రామంలో బీసీ కాలనీకి సరియైన రహదారి లేక ఆ కాలనీ వాసులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతూవచ్చారు. వైసీపీ పాలనలో అనేక మార్లు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారినుంచి స్పందన లేదు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం బీసీ కాలనీకి సీసీ రోడ్డు వేయించింది. దీంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధిని పట్టించుకోలేదు..



వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిప్పేస్వామి గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. గుంతలమయమైన రహదారులను గుర్తించి సీసీ రోడ్డు వేయించారు. తురుకువాండ్లపల్లి గ్రామంలో ఎన్నో ఎళ్లుగా రహదారి లేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం సీసీ రోడ్డు వేయడంతో సమస్య తీరింది.

-గిరి, టీడీపల్లి

కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తాం

పంచాయతీ కార్యదర్శులు



లేపాక్షిలో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

లేపాక్షి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. ఈ నేపథ్యంలో తాము శనివారం సామూహిక సెలవు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఎంపీడీఓ నరసింహమూర్తికి ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్‌కు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎనిమిది మంది కార్యదర్శులు సెలవుపై వెళ్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు రమేష్, నాగరాజు, దుర్గయ్య తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పని ఒత్తిడి భరించలేకపోతున్నాం

గుడిబండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి భరించలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు ప్రకాశ్, పరిపూర్ణాచారి, హరీష్, అమరేష్, దాదాఖలందర్ శుక్రవారం ఎంపీడీఓ కేశవరెడ్డికి విన్నవించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవుల్లో వెళ్తున్నామన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు.



గుడిబండలో..

ఆగివున్న లారీని ఢీకొన్న ఓల్వో బస్సు

ఆరుగురికి తీవ్రగాయాలు



లారీని వెనుక నుంచి ఢీకొన్న బస్సు

చిలమత్తూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఓ ప్రైవేటు ఓల్వా బస్సు ఢీకొనడంతో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాదు నుంచి బెంగళూరుకి శుక్రవారం తెల్లవారుజామున విజయానంద్ ఓల్వా బస్సు వెళుతోంది. 44వ జాతీయ రహదారిపై కోడూరు తోపు సమీపంలో కట్టుకాలువ వద్ద లారీ రోడ్డు పక్కనే ఆగి ఉంది. అయితే వేగంగా వచ్చిన బస్సు ఆగివున్న లారీని గుర్తించలేక వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జైంది. ప్రమాదంలో బస్సు ముందు సీట్లలో కూర్చొన్న ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 వాహనంలో వారిని బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తండాలోకి దూసుకెళ్లిన బస్సు.. తప్పిన పెనుప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

గోరంట్ల, జూన్27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగుళూరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం మిషన్ తండా వద్ద బస్సు అదుపు తప్పి తండాలోకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న గ్రీన్‌లైన్ బస్సు మిషన్ తండా వద్ద జాతీయ రహదారిపై యూటర్న తీసుకుంటున్న క్యాంటర్ లారీని తప్పించే ప్రయత్నంలో వేగంగా తండాలోకి దూసుకెళ్లింది. ఓ మరుగుదొడ్డిని ఢీకొని ఆగింది. అయితే ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అక్కడే విద్యుత్ స్తంభం ఉందని, దానిని ఢీకొని వుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు అన్నారు.

చెరువుల మరమ్మతుకు రూ.8.16 లక్షలు..

ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ

రొద్దం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూడు చెరువుల మరమ్మతులకు రూ.8.16లక్షల నిధులు మంజూరైనట్లు పెనుకొండ ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ తెలిపారు. బూచర్ల రూ2.59లక్షలు, గొబ్బరంపల్లి రూ.2.64లక్షలు, చోళేమర్రి రూ.2.93లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆయా చెరువుల ఆయకట్టు ప్రెసిడెంట్‌లు మరమ్మతులు చేపడతారన్నారు. చెరువుకట్టపై ముళ్లకంపలు తొలగించడానికి నిధులను ఖర్చుచేస్తామన్నారు. మండలంలోని 30చెరువుల మరమ్మతుల కోసం రూ.1.5కోట్లు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు గాయాలు

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొడిగెనహళ్లి గ్రామంలో శాసనకోట రోడ్డులో నివాసముంటున్న మహిళ ఇంటిపై కప్పుపై ఉన్న రాడ్‌ను తొలగించే సమయంలో విద్యుత్ షాక్ తగిలింది. పెద్దింటి రామాంజినమ్మ ఇంటి పైకప్పుపై బట్టలు ఆరవేసేందుకు వెళ్లి పక్కనే ఉన్న రాడ్‌ను తొలగించే సమయంలో 11కేవీ విద్యుత్‌లైన్‌కు రాడ్ తాకడంతో విద్యుత్ షాక్ తగిలింది. న్యూట్రల్, ఫేస్ ఒకదానికొకటి అర్త్ కావడంతో ఫ్రిడ్జ్, ఫ్యాన్, టీవీ తదితర సామగ్రి కాలిపోయింది. గాయపడిన మహిళను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు మహిళ తెలిపారు.

ఉపాధి హామీ పథకం జేఈ మృతి

గోరంట్ల, జూన్27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉపాధి పథకంలో జేఈగా పనిచేస్తున్న గంగాద్రి (58) శుక్రవారం ఉదయం మృతిచెందాడు. గురువారం సాయంత్రం 6.30గంటలకు సెల్‌ఫోన్ ఇంటిలోనే ఉంచి, గంగాద్రి బజారుకు వెళ్లారు. మద్యం సేవించే అలవాటు ఉండడంతో ఆలస్యంగా వస్తారని కుటుంబసభ్యులు భావించారు. రాకపోవడంతో గాలించగా ఆర్టీసీ బస్టాండ్‌లో శవమై కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. అతడి ముఖం, తలకు గాయాలు కనిపిస్తున్నాయి. సీఐ శేఖర్ సంఘటనాస్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఉపాధి పీడీ విజయప్రసాద్, ఏపీడి శివానందనాయక్, ఎంపీడీఓ నరేంద్రకుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ పుష్పలత నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న పీడీ, ఏపీడీ తదితరులు